# ఈ ఓపిక సరయినదేనా?

ఊరికంతా అప్పిగాడు లోకువ. అప్పిగానికి నేను లోకువ అన్నాడట ఆయన ఎవరో. అప్పిగానికి తాను ఊరికి లోకువయితినే అన్న బాధ లేదు. తనకు గూడా ఎవరో ఒకరు లోకువయితే చాలు. ఇది ఒక అప్పిగానికి మాత్రమే సంబంధించిన విషయం కానే కాదు. మన దేశంలో అందరి మనస్తత్వం ఇట్లాగే ఉంటుంది. 'తుల్య నిందా స్తుతిర్మౌనేః' అనగలిగిన దేశం మనది. రాజపూజ్య రాజావమానాలు గ్రహచారం కొద్దీ వచ్చేవి మాత్రమే అనుకోగలిగిన మంచి సంప్రదాయం మనది. దూషణ భూషణ తిరస్కారాలకు చలించని గట్టి మనుషులం మనమంతా. అవమానం భరించినందుకు కొంప మునగక పోవచ్చు. కానీ అన్యాయాన్ని కూడా అంతే సులభంగా భరించడం మనకు అలవాటయింది. దాంతో కొంచెం తంటా ఉంది. రాజకీయాల్లో తప్ప ఓడి పోయినవారికెవరికీ కోపం రాదు. అందుకే మనవాళ్లు ఆటల్లో ఓడికూడా జల్సా చేసుకోగలరు. కచేరీలో వ్యాజ్యం పోయి ఇల్లు గుల్లయినా ఫరవా లేదు. చివరకు కూరగాయలు పుచ్చువి అంటగడితే ఎందుకిలా అని అడిగే సత్తా లేదు. అన్నిటికీ ఒకటే ఊరడింపు. "ఖర్మం అలా ఉంటే ఎవరు మాత్రం ఏం చేయగలుగుతారు లెద్దూ" అని సరిపెట్టుకోవడం. అడిగితే తంతారేమోనన్న భయం కూడా ఓ మూలన కొంత లేకపోలేదు. అంతా కలిపితే తాత్పర్యం ఒకటే. అవసరం లేని వాళ్లు కూడా అన్యాయం చేయడానికి అడుగు ముందుకేస్తారు.

జంటనగరాల్లో ఆటోవాళ్లతో మాట్లాడడానికి ప్రయత్నించిన వారందరికీ తప్పకుండా ఒక అనుభవం అయ్యే ఉంటుంది. పూర్వ జన్మలో యక్షులూ గంధర్వులుగా విమానాల్లో తిరిగి ఏదో శాపం కారణంగా భూలోకం మీదకి వచ్చిన జాతి వారు తమ విమానాలనూ రథాలనూ మరిచిపోలేక ఆటోలు నడుపుతున్నారని ఒక పెద్దమనిషి చెప్పారు. అది అక్షరాలా నిజమనిపిస్తుంటుంది. వారు మీరడిగిన చోటికి వస్తానంటే గొప్ప అనుగ్రహం ప్రసాదించినట్లే లెక్క. ఆ రథంలో కూచున్న తర్వాత మొదలవుతుంది కథ. మీటరు రెండు కిలోమీటర్ల దూరం కాకముందే

తిరగడం మొదలవుతుంది. అప్పుడో ఇప్పుడో మాత్రమే ఆటో ఎక్కే వాళ్లకు ఈ రహస్యం తెలియదు. నిత్యమూ ఎక్కే వాళ్లకు కూడా అంత ధ్యాస ఉండదు. ఉన్నా ఏమో చూద్దాంలే అని ఊరుకుంటారు. ఆ తర్వాత ఆ మీటరు ఆటో చక్రాలకంటే వేగంగా తిరగడం మొదలవుతుంది. వెళ్ల వలసిన చోటికి చేరిన తర్వాత చూస్తే భయం పుట్టే అంకె ఒకటి కనబడుతుంది. మామూలుగా ఇరవై రూపాయలయ్యే చోటికి ఇరవైరెండు నుంచి ఆపైన ఎంతయినా అయ్యుంటుంది. నిన్ననెప్పుడో ఇరవయ్యే కదా అయ్యింది అని అంతరాత్మ ఘోషించిందనుకోండి. ఇక జరిగిన అన్యాయానికి తోడు అవమానం కూడా సిద్ధంగా ముందు నిలుచుంటుంది. "నీ మొహానికి నీవెప్పుడయినా ఆటో ఎక్కావా?" అనిపించుకున్నా ఆశ్చర్యం అవసరం లేదు. మంచి తనం మీద నమ్మకం గల గంధర్వుడయితే "ఏం చేయమంటావు? పెట్రోలు బంకు వాళ్లూ ఆటో సొంతదారూ నన్ను అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేక నేను నిన్నన్యాయం చేస్తున్నాను. నీవు వెళ్లి మరెవర్నయినా వెదికి వాళ్లను నీ ఇష్టం వచ్చినంత అన్యాయం చెయ్యి" అని ఉచితంగా ఒక సలహా పడేసి, బతుకుదారి గురించి విడమర్చి చెప్పిన యోగిలాంటి కటాక్షవీక్షణమొకటి మనమీద పడెయ్యవచ్చు. ఉండనే ఉందిగా మన తాత్వికత. దాన్నీ కొంచెం భయాన్నీ మేళవించి అంతకన్నా ఫిలసాఫిక్ నవ్వొకటి పెదవులకంటించుకుని జేబులో లేదా పర్సులో చేయి పెట్టక తప్పదు. గంధర్వులు పూర్తి రూపాయలేగానీ చిల్లర్లు పుచ్చుకోరనే సత్యమొకటి ఆ తర్వాత ఘట్టంలో ఎదురవుతుంది. ఓ ఫలానా అంకె మీద ఎంత చిల్లరయినా సరే ఆ తర్వాతి రూపాయకి పూర్తి చేసి ఇవ్వాలన్నమాట. చిల్లర గానీ చేతిలో కనబడిందంటే మన పరిస్థితి పురుగుకంటే కనకష్టమవుతుంది.. రూపాయలు రెండ్రూపాయలు సాధారణంగా ఉండవు గనుక ఓ పెద్దనోటు గానీ బయటకు వచ్చిందంటే కథ మరో అంచె ముందుకు పోతుంది. గంధర్వుల దగ్గర చిల్లర ఉంటుందనుకోవడం నిజానికి మన మూర్ఖత్వమే అయినా ఈ విషయం మనకు తెలిసే పద్ధతి చాలా బాగుంటుంది. మొత్తానికి కొంత అదనపు ఖర్చు, కొంత అన్యాయం, మరి కొంత జ్ఞానోదయంతో యాత్ర ముగుస్తుంది. తెలివి తక్కువ కొద్దీ నోరు చేసుకోవడానికి పూనుకుంటే ఎదురుగా తిట్లు రావన్న గ్యారంటీ లేదు. పోలీసులకో మరొకరికో ఫిర్యాదు చేయాలనుకోవడంకన్నా తెలివి తక్కువ పని

ఇంకొకటి ఉండదు. ఈ దేశంలో రక్షకులనుకున్నవారంతా దొంగలతో గట్లు పంచుకునే వారే గానీ మామూలు మనిషి మాట వినే వారు కారన్నది అనుభవంగా తెలిసిన సత్యం. ఈ ఆటోల మీటర్లకు బాధ్యులయిన శాఖ వారు తెలిసి తెలిసీ ఆ మీటర్లలో పది నుంచి నలభయి శాతం దాకా ఎక్కువ చూపించే పద్ధతికి తోడ్పడుతున్నారని ఎంతమందికి తెలుసు? తెలిసిన వాళ్లు ఏం చేయగలుగుతున్నారు? అంతా మోసం! అంతా అన్యాయం!! అంతా మన ఖర్మం!! తిరువనంతపురంలో కనిపించిన ప్రతి ఆటో మీదా కోర్టు కేసు చేసి మొత్తం గంధర్వులందరికీ సింహస్వప్నంగా మారిన ఒక మిత్రుని గురించి నాకు తెలుసు. కానీ ఒక మనిషి కొన్ని వేలమందితో, అది కూడా అధికారుల అండగలవారితో పోరాడగలగడం అసాధ్యమని వేరే చెప్పాలా?

అన్యాయం గురించి గొంతెత్తడంకన్నా అన్యాయమయిన పని మరొకటి లేదనేది మన అనుభవం. పోలీసు స్టేషనుకు వెళ్లడం కంటే వ్యభిచార గృహానికో కల్లుపాకకో వెళ్లడం గౌరవంగా ఉంటుందనుకునే పరిస్థితి మనది. ఇక కోర్టుకు వెళ్లడమంత తక్కువదనం మరొకటి లేదు. న్యాయం కోసం ఆ చోట్లకు వెళ్లినా అది దొరికే వీలుండదు. ఒకవేళ ఉంటే ఆ న్యాయం దొరికే లోపల దాని అవసరం తీరి పోయి ఉంటుంది. ఇంతకూ అన్యాయం చేసేది వీళ్లు మాత్రమేనా అనేది అసలైన ప్రశ్న.

ఒకరు అన్యాయం చేయడానికి వంద మంది కారణమవుతున్నారు. పెట్రోలు వాళ్లు తక్కువ పోస్తారు. తూచే వాళ్లు తక్కువ తూస్తారు. కొలిచి ఇచ్చే వాళ్లు తక్కువ కొలిస్తే కొలిచి తీసుకునే వాళ్లు మాత్రం ఎక్కవ కొలుస్తారు. జనాభా వాళ్లు వచ్చినప్పుడు ఇంట్లో ఉండే మనుషుల సంఖ్య ఒకటయితే రేషన్ కార్డు వాళ్లకు చెప్పే సంఖ్య ఇంకొకటి. పుచ్చుకునే చోటికి వచ్చేటప్పటికి మొత్తం కుటుంబం అటు ఊళ్లోనూ ఉంటుంది. ఇటు పట్నంలోనూ ఉంటుంది. చిన్నా చితకా అన్యాయం భరించడం గొప్ప కాదనుకుంటే పొరపాటే. అందరూ ఇదే పని చేస్తే రేషన్ ఇచ్చేవాళ్ల లెక్కలో దేశజనాభా రెండింతలయి కనిపిస్తుంది. అందాల్సిన తిండి నిజంగా అవసరమయిన వారికి అందనే అందదు.

సర్కారువారు బడి కట్టిస్తారు. దానికింత ఖర్చయిందని ఒక లెక్క చూపుతారు. ఆ బడిని కట్టిన గుత్తేదారు ఆ పక్కనే బడికి ఆరంతలుండే బంగ్లా కట్టుకుంటాడు. అందరికీ ఆ బంగ్లా కట్టడం ఎట్లా వీలయ్యిందనేది తెలిసే ఉంటుంది. కానీ ఎవరూ గొంతెత్తరు. అది మనపని కాదని అందరూ అనుకుంటారు. బంగ్లా కట్టడం మన పని కాదు. కనుక అది ఎక్కడినుంచి వచ్చిందని అడగడమూ మన పని కాదు. అది ప్రజాధనం అన్నమాట ఎవరికీ గుర్తు కూడా రాదు. కరకరలాడే రూపాయనోట్లు పోసిన చోట జరిగే అన్యాయాన్ని గురించి గొంతెత్తే ధైర్యం లేని వాళ్లు ఈ రకమయిన ప్రజాధనం గురించి మాట్లాడవచ్చని అనుకోవడం కూడా ఉండదు. కొనుక్కొచ్చిన గుడ్డ వారంరోజుల్లో రంగు పోయి ఉతుకుతుక్కు జానెడు పొట్టిదయితే మరో దేశంలోనయితే ఆ ఫలానా కంపెనీ మీద నష్టపరిహారానికే గాక కలిగిన మానసిక క్షోభకు కూడా వెలకట్టి దావా వేస్తారట. కంపెనీవారు కూడా కిక్కురుమనకుండా ఆ సొమ్మేదో ఇచ్చి అందుకు కారణమయిన సరుకును దుకాణంనుంచే తొలగిస్తారట.

ఎవరు చేసినా అన్యాయం అన్యాయమే. అడిగే దిక్కు లేకపోతే అది అలా పెరుగుతూనే ఉంటుంది మరి.

కె.బి.గోపాలం